క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డికి వంగా గీత పరామర్శ



సుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న వంగా గీత, ఇతర నాయకులు

పిఠాపురం: మాతృ వియోగంతో ఉన్న రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వైవీ సుబ్బారెడ్డిని సోమవారం విజయవాడలో పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత పరామర్శించారు. ఆయన తల్లి మరణానికి చింతిస్తూ, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట పార్టీ పిఠాపురం పట్టణ, మండల, కొత్తపల్లి మండలాల అధ్యక్షులు రావుల మాధవరావు, అడపా రఘు, ఆనాల సుదర్శన్, నాయకులు బత్తిన సాయి తదితరులున్నారు.

మహిళా ఆటో డ్రైవర్‌కు యూనిఫాం అందజేత



యూనిఫాం అందజేస్తున్న ట్రాఫిక్ ఎస్సై

సామర్లకోట: మహిళా ఆటో డ్రైవర్‌కు సామర్లకోట ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు సోమవారం యూనిఫాం అందజేశారు. పిఠాపురానికి చెందిన వెంకటలక్ష్మి తన కుటుంబ పోషణ కోసం బ్యాంకు రుణంతో ఆటో నడుపుతోంది. పిఠాపురం నుంచి సామర్లకోట మధ్య ఆటోను తిప్పుతోంది. ఆటో డ్రైవర్లు ఖాకీ యూనిఫాం ధరించాలనే నిబంధన మేరకు ఆమెకు ఎస్సై యూనిఫాం అందజేశారు. పట్టణంలో ఆటో యూనియన్ సమావేశాలు నిర్వహించి, ఉగాది నుంచి డ్రైవర్లందరూ యూనిఫాంతో ఉండాలని ఎస్సై చెప్పారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం

కొత్తపల్లి: గ్రామంలో సెజ్ యాజమాన్యం నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కాజులూరి అమ్మాజీ అన్నారు. మండలంలోని రమణక్కపేటలో సెజ్ యాజమాన్యం రూ.10 లక్షలతో నిర్మించిన వెయ్యి లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్వో ప్లాంట్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అలమూరు బాబీ, సెజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పది మంది గైర్హాజరు

సామర్లకోట: మండలంలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో సోమవారం జరిగిన గణితం పరీక్షకు పది మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, గణితం పరీక్షకు 1,501 మందికి 1,491 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు చెప్పారు. వీకే రాయపురం అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్, డీసీఈబీ సెక్రటరీ వెంకట్రావు పరీక్షా కేంద్రాలను పరిశీలించినట్టు తెలిపారు.

27న ఉప సర్పంచ్ ఎన్నిక

సామర్లకోట: మండలంలోని పి.వేమవరం ఉప సర్పంచ్ ఎన్నిక ఈ నెల 27న జరుగుతుందని ఈఓపీఆర్డీ భైరవమూర్తి తెలిపారు. ఉప సర్పంచ్ అత్తిలి సుబ్బలక్ష్మి ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. దాంతో ఆ పదవిని భర్తీ చేసేందుకు ఎన్నిక నిర్వహిస్తారన్నారు. గ్రామానికి చెందిన వార్డు సభ్యులు ఈ ఎన్నికకు హాజరై, ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు

పాడా పీడీ చైత్రవర్షిణి

పిఠాపురం: పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(పాడా) పరిధిలో వచ్చిన ప్రతి అర్జీని సత్వరం పరిష్కరించడానికి అన్ని చర్యలు తీసుకోవాలని సంస్థ పీడీ చైత్రవర్షిణి అధికారులకు ఆదేశించారు. ఆమె సోమవారం పిఠాపురం పాడా కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి సోమవారం పాడా కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సదస్సులో మొత్తం 90 అర్జీలు వచ్చాయని, వీటిలో రెవెన్యూ 31, మున్సిపాలిటీ 20, అగ్రికల్చర్ 5, పింఛన్లు 11, ఇతర సమస్యలకు సంబంధించి 23 అర్జీలు అందినట్టు వివరించారు. పాడా ఏపీడీ వసంతమాధవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువకుడి మృతి

కంచికచర్ల: లారీని వెనుక నుంచి బైక్ ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల ఎస్సై రాజు వివరాల మేరకు, తూర్పుగోదావరి జిల్లా గొల్లప్రోలు మండల కేంద్రానికి చెందిన హరహర వీరాచారి(25) హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం హైదరాబాద్ నుంచి సొంతూరుకు బైక్‌పై బయలుదేరాడు. మండలంలోని పరిటాల సమీపంలో ఫ్లై ఓవర్ రోడ్డుపై ముందు వెళ్తున్న లారీ సడన్‌గా రోడ్డు పక్కన ఆగింది. బైక్‌ను అదుపు చేయలేక వీరాచారి ఆ లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. అతని తలకు తీవ్ర గాయాలు కావడంతో, హైవే అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టు.. తేలాలి గుట్టు..!



కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్న నాగలోవరాజు



చేబ్రోలులోని పట్టు పరిశ్రమ కేంద్రం

- అనర్హులకు ప్రోత్సాహంపై పట్టు రైతుల ఆందోళన
- చేబ్రోలు పట్టు పరిశ్రమ అధికారుల మాయాజాలం
- అవకతవకలపై విచారణ కోసం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో వినతి

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు పట్టు పరిశ్రమ శాఖ కేంద్రంలో చోటు చేసుకుంటున్న అక్రమాలపై విచారణ చేసి, అర్హులకు న్యాయం చేయాలని పట్టు రైతులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం గొల్లప్రోలు జెడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు ఆధ్వర్యంలో పలువురు పట్టు రైతులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

పట్టు పరిశ్రమ పేరు చెబితే రాష్ట్రంలో గొల్లప్రోలు మండలం చేబ్రోలు మొదటి స్థానంలో ఉంటుంది. కొన్నేళ్లుగా పట్టు ఉత్పత్తిలో చేబ్రోలు గణనీయమైన అభివృద్ధి సాధించింది. అటువంటి చేబ్రోలు పట్టు పరిశ్రమ శాఖ కేంద్రంలో అధికారుల తీరుతో పలు అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. పట్టు సాగు చేయకపోయినా చేసినట్టుగా, వాస్తవంగా పట్టు సాగు చేసిన వారిని చేయలేదంటూ అధికారులు నమోదు చేస్తున్న తీరు తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. గతంలో 53.19 ఎకరాల్లో 26 మంది రైతులను గుర్తించారని, ఇందులో 20 ఎకరాలు దాటి మల్బరీ సాగు చేయలేదని, నువ్వులు ఇతర పంటలు సాగు చేసిన వారికి కూడా మల్బరీ నర్సరీ ప్రోత్సాహం ఎకరానికి రూ.22,500 చొప్పున ఇస్తున్నారని రైతులు ఆరోపించారు. ఇందులో అర ఎకరం సాగు చేసిన వారికి కూడా రెండు, మూడు ఎకరాలు వేసినట్టుగా నమోదు చేశారని పట్టు రైతులు ఇటీవల ఆందోళనకు దిగారు. అలాగే గతేడాది గూళ్లు నష్టపోయిన వారికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రభుత్వపరంగా రూ.11.30 లక్షల సాయం అందించినప్పటికీ, అధికారులకు నచ్చిన రైతులకే దానిని అందించారని, మిగిలిన వారిని వదిలేశారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల రైతులకు పంట ప్రోత్సాహం రావాలంటే వివాదం సద్దుమణిగినట్లు అందరూ సంతకాలు చేస్తేనే ప్రోత్సాహకాలు వస్తాయని నమ్మించిన అధికారులు.. ఆందోళన చేస్తున్న రైతులతోనూ సంతకాలు చేయించుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విచారణ చేపట్టాలి

చేబ్రోలు పట్టు పరిశ్రమ కేంద్రం పరిధిలో చోటుచేసుకున్న పలు అవకతవకలపై విచారణ చేపట్టాలని కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌కు ఫిర్యాదు అందించాను. పట్టు పరిశ్రమ కేంద్రంలో గతేడాది పట్టు పురుగులు పెంచినా.. గూళ్లు కట్టకపోవడంతో నష్టపోయిన రైతులకు అందజేసిన పరిహారంలో అవకతవకలు చోటుచేసుకున్నాయి. అనర్హులకు కూడా భారీగా పరిహారం అందజేశారు. అర్హులైన 13 మంది రైతులకు పరిహారం అందజేయకుండా మొండిచేయి చూపారు. అయా విషయాలను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. తోటల పెంపకం నమోదులో అవకతవకలు చోటుచేసుకున్నాయి. తోటలు పెంచకుండానే ప్రోత్సాహం పొందేందుకు కొందరు రైతులు రాజకీయంగా స్థానిక అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. గతమెన్నడూ లేనట్టుగా పట్టు పరిశ్రమ కేంద్రంలో అవకతవకలు జరిగాయి. దీనిపై ఉన్నతాధికారులతో విచారణ జరపాలని కోరాం. అర్ధాంతరంగా నిలిచిపోయిన పట్టు గూళ్ల మార్కెట్ షెడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరాం. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్.. పట్టు పరిశ్రమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను పిలిచి వివరాలు ఆరా తీశారు. తక్షణం పట్టు పరిశ్రమ కేంద్రంలో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరపాలని ఆదేశించారు. పట్టు మార్కెట్ షెడ్ పూర్తిగా నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

– ఉలవకాయల నాగలోవరాజు, జెడ్పీటీసీ, గొల్లప్రోలు మండలం

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



పంచారామ క్షేత్రంలో కుమారారామ భీమేశ్వరస్వామి

సామర్లకోట: పవిత్ర పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫాల్గుణ మాసం స్వామివారికి ప్రీతైన నాలుగో సోమవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో ఆలయ పండితులు నిర్వహించిన తొలి అభిషేకం, తొలి పూజలను తిలకించడానికి భక్తులు బారులు తీరారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయంలోని ఉప ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామివారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వర శర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

మట్టి అక్రమ తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పాపిడి దొడ్డి చెరువును తవ్వేస్తున్న అక్రమార్కులు



మట్టి అక్రమ తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

పిఠాపురం: మండలంలోని ఎఫ్‌కే పాలెం–విరవాడ గ్రామాల మధ్య సుమారు వంద ఎకరాల పాపిడి దొడ్డి చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు జరుపుతుండడంపై ఎఫ్‌కే పాలెం గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్రమ తవ్వకాల నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ఫిర్యాదు అందజేశారు. అనంతరం పెద్దాపురంలో ఉన్న నీటి పారుదల శాఖ ఈఈ శేషగిరిరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతులు ముమ్మిడి వెంకన్నబాబు, మలిరెడ్డి పల్లపురాజా, ముమ్మిడి వీరబాబు, రామిరెడ్డి శ్రీను, ముమ్మిడి తాతికొండ తదితరులు మాట్లాడుతూ, పాపిడి దొడ్డి చెరువులో ఎటువంటి అనుమతులు లేకుండా కొందరు ఇటుక బట్టీల యజమానులు అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టడం శోచనీయమన్నారు. ఈ క్రమంలో మట్టిని తవ్వి, తరలించడానికి తెచ్చిన పొక్లెయిన్, లారీలను ఆదివారం అడ్డుకున్నామన్నారు.అనేక మంది రైతాంగానికి పుష్కలంగా సాగునీరు అందిస్తున్న ఈ చెరువులో మట్టి తవ్వకాలు చేపడితే రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. సాగునీరు సక్రమంగా అందని పరిస్థితుల్లో నీటి ఎద్దడి ఏర్పడి, రైతాంగానికి నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలుమార్లు ఈ చెరువులో తవ్వకాలు జరిపారని, ఇప్పుడు మరోసారి అక్రమ తవ్వకాలు చేపడితే భారీ గోతులు ఏర్పడి, ప్రజలకు ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తవ్వకాలు జరపగా, అనేక పశువులు మృత్యువాత పడ్డాయని గుర్తుచేశారు. కొందరు వ్యక్తులు కూడా ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో అనుమతుల్లేకుండా మట్టి తవ్వకాలు జరుపుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో ఇటువంటి అక్రమ తవ్వకాలు ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళతామని స్పష్టం చేశారు. అవసరమైతే న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

మాంసం దుకాణాలు పరిశుభ్రంగా ఉండాలి

- మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య
- అపరిశుభ్రతపై ఆగ్రహం



సామర్లకోట సంత మార్కెట్ వద్ద మాంసం దుకాణాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

సామర్లకోట: పట్టణంలోని మాంసం, చేపలు వంటివి విక్రయించే ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ఆదేశించారు. కోడి మాంసంలో పురుగులు వస్తున్నాయనే ఫిర్యాదుల మేరకు స్థానిక సంత మార్కెట్‌లోని మాంసం దుకాణాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. మాంసం ఆరుబయట ప్రదేశంలో ఉంచి విక్రయించడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైన్ సమీపంలో ఉన్న మాంసం దుకాణంలో ఈగలు, దోమలు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉన్న కారణంగా వెంటనే మెస్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దుకాణం అపరిశుభ్రంగా ఉండటంతో ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. మాంసం దుకాణం నిర్వహణపై ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేయాలని శానిటరీ సూపర్‌వైజర్లకు కమిషనర్ నిర్దేశించారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించే వరకూ మాంసం దుకాణం తాత్కాలికంగా మూసివేయాలని ఆదేశించారు. అదేవిధంగా సంత మార్కెట్‌లోని చేపల మార్కెట్ సముదాయాన్ని ఆమె పరిశీలించి, వ్యాపారులకు పలు సూచనలు చేశారు. పట్టణంలోని అన్ని మాంసం దుకాణాలను తనిఖీ చేయాలని స్థానికులు కోరారు. మిఠాయి దుకాణాలతో పాటు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో తినుబండరాలపై మూతల్లేకుండా విక్రయాలు చేస్తున్నారని ఈ సందర్భంగా పలువురు ఫిర్యాదు చేశారు. కమిషనర్ వెంట శానిటరీ మేస్త్రులు, సిబ్బంది ఉన్నారు.

నకిలీ ఇళ్ల పట్టాలపై విచారణ చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రవీంద్రబాబు

సామర్లకోట: పట్టణ, మండల పరిధిలో విక్రయిస్తున్న నకిలీ పట్టాలపై విచారణ జరపాలని దళిత సంఘ నాయకుడు కాళ్ల రవీంద్రబాబు సోమవారం తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. పేదల నుంచి రూ.20 వేల చొప్పున వసూలు చేసి, నకిలీ పట్టాలు ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ పట్టాలపై సర్వే నంబరు, రిఫరెన్స్ నంబర్లు లేకపోవడంతో అనుమానం వచ్చి విచారణ చేయగా నకిలీ పట్టాలుగా గుర్తించారన్నారు. పట్టణంలోని బలుసులపేటకు చెందిన ఏడుగురు నకిలీ పట్టాలను కొనుగోలు చేసి మోసపోయారన్నారు. అలాగే మండలంలో ఇంకా అనేక మంది మోసపోయారని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. నకిలీ పట్టాలపై జిల్లా కలెక్టర్, కాకినాడ ఆర్డీఓలకు వినతిపత్రాలు అందజేసినట్లు రవీంద్రబాబు తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ, దీనిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, విచారణ చేస్తామని చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్



గ్రీవెన్స్‌లో అర్జీని పరిశీలిస్తున్న ఏఓ మాధవరావు

పెద్దాపురం: ప్రతి వారం ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి పీజీఆర్ఎస్(గ్రీవెన్స్) నిర్వహిస్తున్నట్టు ఆర్డీఓ కార్యాలయ ఏఓ కేవీ మాధవరావు అన్నారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ మండలాల నుంచి పది అర్జీలు అందినట్టు చెప్పారు. అనంతరం ఏఓ మాధవరావు విలేకర్లతో మాట్లాడుతూ, డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి, సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా డివిజన్ స్థాయిలో ఆయా శాఖల అధికారులు గ్రీవెన్స్‌కు హాజరయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రతి అర్జీని పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖాధికారిపై ఉందన్నారు. ఈ వారం అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష, హౌసింగ్ అధికారి రవిశంకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన కోసం పీ4 సర్వే

మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య



సదస్సులో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీవిద్య

సామర్లకోట: సమాజంలో పేదరిక నిర్మూలన కోసమే పీ4 సర్వే జరుగుతుందని, ఈ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. సోమవారం స్థానిక గోలివారి వీధి 9వ సచివాలయంలో నిర్వహించిన సర్వే అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ప్రభుత్వం, దాతల సహకారంతో పేద ప్రజలను గుర్తించి, వారికి అవసరమైన సదుపాయాలను కల్పించి, ఆర్థికంగా బలోపేతం చేస్తారన్నారు. అర్హత ఉన్న వారికి ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ రవిచంద్రప్రసాద్, కౌన్సిలర్ గొర్రెల జయలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో..

కొత్తపల్లి: మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల వద్ద సోమవారం పీ4 సర్వేపై గ్రామసభలను నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో 27 రకాల ప్రశ్నలతో కుటుంబ సర్వే, ఇంట్లోని విలువైన వస్తువుల వివరాలు సేకరించారు. దీనిపై ప్రజల అభ్యంతరాలు స్వీకరించేందుకు గ్రామసభలు నిర్వహించినట్టు ఎంపీడీఓ రవికుమార్ తెలిపారు. వీటి ఆధారంగా వారి అభ్యంతరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు.

కుల వృత్తిని దెబ్బతీస్తున్న కార్పొరేట్



ఆందోళన వ్యక్తం చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

పిఠాపురం: నాయీ బ్రాహ్మణుల కులవృత్తిని దెబ్బతీసేలా, వారి జీవనోపాధికి విఘాతం కలిగించేలా కార్పొరేట్ స్థాయిలో నిర్వహించ తలపెట్టిన సెలూన్ షాప్‌లపై పిఠాపురం పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో పాడా పీడీ చైత్రవర్షిణికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ, తమ కులవృత్తి మేరకు సెలూన్ షాపులపై ఆధారపడి, కుటుంబాలను పోషించుకుంటున్నామని చెప్పారు. తమ కులం కాని కొందరు పట్టణంలో కార్పొరేట్ స్థాయి హంగులతో సెలూన్ షాపులను ఏర్పాటుచేసి, తమ పొట్ట కొట్టేందుకు యత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుల వృత్తిపై ఆధారపడి పట్టణంలో సుమారు వందకు పైగా షాపులు నిర్వహిస్తున్నామన్నారు. తమకు కుల వృత్తి మినహా వేరే ఆధారం లేదని, కేవలం వ్యాపార దృక్పథంతో నిర్వహించే కార్పొరేట్ స్థాయి షాపుల నిర్వహణకు అనుమతులున్నాయో, లేవో అధికారులు పరిశీలించి, తమకు న్యాయం చేయాలని కోరారు.

కొమరగిరి లే అవుట్‌లో ఖాళీలు లేవు

తహసీల్దార్ చిన్నారావు



కొత్తపల్లి: మండలంలోని కొమరగిరి శివారు ఆనందనగరంలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో సేకరించిన భూమిలో ఎటువంటి ఖాళీలు లేవని తహసీల్దార్ జి.చిన్నారావు సోమవారం ఇక్కడ తెలిపారు. గతంలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో పేదలకు ఇళ్లు ఇవ్వడానికి 71.04 ఎకరాల భూమిని ప్రభుత్వం భూసేకరణ ద్వారా స్వాధీనం చేసుకుందన్నారు. ఆ భూమిలో లే అవుట్ చేసి కాకినాడ అర్బన్ లబ్ధిదారులకు కేటాయించారన్నారు. ఆ భూమిని కాకినాడ అర్బన్ రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ఆ లేఅవుట్‌లో ఉన్న ఇళ్ల స్థలాలు లబ్ధిదారులందరికీ పంపిణీ చేయడం వల్ల ఎక్కడా ఖాళీ స్థలాలు లేవన్నారు. కొందరు వ్యక్తులు ఆ లే అవుట్‌లో ఇళ్ల స్థలాలు ఇస్తున్నట్లు ప్రచారం చేస్తున్నట్లు తెలిసిందన్నారు. అటువంటి ప్రచారాలు ఎవరూ నమ్మవద్దని చెప్పారు. అలాంటి ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

టీబీని ప్రారంభంలోనే గుర్తించాలి

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీలు



వేట్లపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



కొత్తపల్లిలో క్షయపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు



సామర్లకోటలో టీబీపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అమల



పెద్దాపురంలో ర్యాలీ ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ సతీష్‌రెడ్డి

సామర్లకోట: ప్రాణాంతకమైన టీబీని ప్రారంభంలోనే గుర్తించడం ద్వారా వ్యాధి నుంచి విముక్తి పొందడానికి ఆస్కారం ఉంటుందని స్థానిక పీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అమల అన్నారు. ప్రపంచ క్షయ వాధి నివారణ దినం సందర్భంగా ఆస్పత్రిలో వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, రెండు వారాల పాటు నిరంతరం దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్నప్పుడు క్షయ వ్యాధిగా భావించి, వెంటనే వైద్య పరీక్షలు చేయించాలన్నారు. వ్యాధి నిర్ధారణైతే, పూర్తి చికిత్సకు ఉచిత మందులు, పౌష్టికాహారం కోసం నెలకు రూ.వెయ్యి చొప్పున రోగి బ్యాంకు ఖాతాకు జమ చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ డాక్టర్లు వరలక్ష్మి, కార్తిక్, హెడ్ నర్సు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా వేట్లపాలెం పీహెచ్‌సీ పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.పరదేశ్ మాట్లాడుతూ, దేశంలో క్షయ వ్యాధి సంపూర్ణ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని, ఈ మేరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. పట్టణంలోని రెండు అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో డాక్టర్లు పి.రామశ్రీదుర్గ, విజయపావని రమ్యప్రభ ఆధ్వర్యంలో ర్యాలీలు జరిగాయి.

అవగాహన తప్పని సరి

కొత్తపల్లి: క్షయ వ్యాధిపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సౌజన్య అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సంప్రదించాలని ఆమె సూచించారు. క్షయ వ్యాధికి సంబంధించిన పరీక్షలు ఉచితంగా చేసి, మందులు అందిస్తారన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సరోజిని, హెచ్‌ఈ గౌరీశ్వరి, హెచ్ఎస్ అప్పారావు, హెచ్‌వీ జ్యోతి, రత్నకుమారి, ఎంపీహెచ్ఏ గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆ బాధ్యత ప్రతి ఒక్కరిది

పెద్దాపురం: టీబీపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పెద్దాపురం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సతీష్ రెడ్డి, ఎస్టీఎస్ ఎన్పీ రమణ అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినంలో భాగంగా సోమవారం టీబీ యూనిట్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. వారు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎల్‌టీ భవానీ, ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాస్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లకు నేటి నుంచి శిక్షణ

పిఠాపురం: మండలంలోని చిత్రాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అంగన్‌వాడీ వర్కర్లకు మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పిఠాపురం ఐసీడీఎస్ సీడీపీఓ దుర్గాదేవి తెలిపారు. ఈ సందర్భంగా పిఠాపురంలో ఆమె మాట్లాడుతూ, మంగళవారం నుంచి మూడు రోజుల పాటు పోషణ్ భీ, పఢాయి భీ అనే కార్యక్రమంలో శిక్షణ ఇస్తారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల అభివృద్ధికి రూపొందించే కార్యక్రమాలపై శిక్షణ ఉంటుందన్నారు.